
ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

అందరినీ ఆదుకుంటా

వరదలో నష్టపోయిన ఏ ఒక్కరికి లోటు రానివ్వను : ఏలూరులో సీఎం చంద్రబాబు

- కాలువలు, డ్రెయిన్లలో పూడిక తీయిస్తాం
- మీరు ఇచ్చిన అధికారమే ఇది
- మీకోసం ఏదైనా చేయడానికి సిద్ధం
- గత ప్రభుత్వ పాపాలు ప్రజలకు శాపాలు
- రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

'మీ కష్టాలు చూశా. ప్రతీ ఒక్కరికి న్యాయం చేసే బాధ్యత తీసుకుంటా. ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందించడమే కాదు యంత్రాంగాన్ని ఆ దిశగా నడిపిస్తున్నా. మీకు ఏ లోటు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటా. ధైర్యంగా ఉండండి' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. బుధవారం కొల్లేరు ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించి వరద ముంపును పరిశీలించారు. ఏలూరులో తమ్మిలేరును వీక్షించి సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో బాధిత రైతులు, ప్రజలతో సంభాషించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. మారుతున్న పరిస్థితులతోపాటు వాతావరణ స్థితిగతులపై మనం కొంత అవగాహన పెంచుకోవాలి. క్లౌడ్ బరెస్ట్ జరుగుతోంది. మేఘాలు ఒక్కసారిగా ఉన్నఫలంగా ఒకేచోట వర్షిస్తాయి. అంతే అతి భారీ వర్షాలతో అంతా అల్లకల్లోలమే. విజయవాడ ఎగువున ఈ మధ్యన అదే జరిగింది. దాని ప్రభావమే ఎక్కడికక్కడ విధ్వంసం అని సీఎం చంద్రబాబు అన్నారు. సమర్థవంతంగా పనిచేసి ఎక్కడికక్కడ పరిస్థితిని అదుపులోకి తేగలిగామని, తాను వరద సహాయ చర్యల్లో స్వయంగా దిగితే ఐఏఎస్‌లు తన బాట పట్టారని, ప్రజల కష్టాలను గుర్తించి సహాయం వేగవంతం చేయగలిగారని సీఎం కొనియాడారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ముందుగానే అవగాహన కోసం వరదలను సైతం మ్యాపింగ్ చేయదలిచామని, తద్వారా ఎక్కడికక్కడ ముందస్తు చర్యలకు వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. బుడమేరు వరదకు రకరకాల వక్రభాష్యాలు వల్లించడానికి జగన్ పత్రిక సాహసించిందంటూ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఇలాంటి సవాళ్లను తాము ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ఒక్క వరదలే కాదు సమస్య ఏదైనా దాని పరిష్కారం నిమిత్తం ముందు వరుసలో నిలిచేది మేమేనంటూ గత అనుభవాలను చెప్పుకొచ్చారు. తన హయాంలో రాయలసీమలో ముఠా నాయకులు లేకుండా చేశామని, మత విద్వేషాలు లేకుండా మెరుగైన పాలన అందించామన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో తనపై బాంబుల దాడి చేసినా ప్రజల కోసం ప్రాణాలను సైతం పట్టించుకోకుండా ముందుకెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. ఒకప్పుడు హెలికాప్టర్ల ద్వారా సహాయ చర్యలు చేపట్టేవాళ్ళం. ఇప్పుడు సాంకేతికతను ఉపయోగించుకుని డ్రోన్ల ద్వారా ఆహార పదార్థాలను ఎక్కడికక్కడ మిద్దెల మీద ఉన్న వారికి అందించామని, ఇక ముందు సాంకేతికతను మరింత మెరుగుపరిచి ఉపయోగించుకుంటామని సీఎం స్పష్టం చేశారు.


కొల్లేరు, ఉప్పుటేరు, తమ్మిలేరు వరదలపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు పార్థసారథి, నిమ్మల, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎంపీ పుట్టా, ఎమ్మెల్యేలు చింతమనేని, చంటి, కామినేని


తమ్మిలేరును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు


సీఎం సమీక్షకు హాజరైన ప్రజలు

రైతుల కోసం ఏమైనా చేస్తాం..

గోదావరి జిల్లా ప్రజలతో నాకు మంచి అనుబంధం ఉంది. మొదటి నుంచి ఈ జిల్లాలు తమకు మద్దతుగా ఉన్నాయి. పోలవరం రాష్ట్రానికి ఓ వరంగా రూపుదిద్దాం. రైతుల కోసం రెండు పంటలకు నీరు ఇవ్వడానికి తగిన కార్యాచరణ రూపొందించుకుని ముందడుగు వేశాం. కాని గడిచిన ఐదేళ్లల్లో పోలవరం పనులన్నీ సర్వనాశనమయ్యాయి. రైతులు ఇబ్బంది పడ్డారని సీఎం అన్నారు. తాము రైతుల కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగానే ఉన్నామని, గతం కంటే ఇప్పుడు మెరుగ్గా పరిహారం పెంచుతున్నట్టు ప్రకటించారు. వరి రైతులను ఆదుకునేందుకు విధాన నిర్ణయాలు తీసుకుంటున్నామని, ఇవన్నీ మరో వారం తర్వాత కార్యరూపం దాలుస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి జిల్లా తాజా పరిస్థితులను సీఎం చంద్రబాబుకు వివరించారు.

శభాష్.. మావాళ్లు గట్టోళ్లు

- పార్థసారథి, నిమ్మల, రఘురామకు ప్రశంసలు

ఒకవైపు తన సొంత నియోజకవర్గంలో వరద సహాయ చర్యల్లో పాలుపంచుకుంటూనే ఇంకోవైపు రాత్రికి విజయవాడ చేరుకుని తిరిగి సహాయ చర్యలు కొనసాగించడంలో అద్భుతమైన ప్రతిభ చూపారని మంత్రి పార్థసారథిని సీఎం ప్రశంసలతో ముంచెత్తారు. ఏలూరు జిల్లాలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు సహాయ చర్యలు ఎలా జరుగుతున్నాయో ఆరా తీస్తూ.. అవి క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో, లేదో సరిచూసుకున్నారని అభినందించారు. మరో మంత్రి నిమ్మల రామానాయుడు ఐదు రోజుల పాటు బుడమేరు గండిని పూడ్చేందుకు నిద్రాహారాలు మాని శ్రమించారంటూ స్వయంగా మంత్రిని చూస్తూ అభినందనలు తెలిపారు. అధికారులు, సిబ్బంది తమ వంతు సహకారం అందించారన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వరద ప్రాంతాల్లో తమను ఆదుకున్న తీరును బాధితులు తమ మాటల్లో చెప్పినప్పుడు ప్రభాకర్‌ను చూస్తూ పరోక్షంగా అభినందనలు తెలిపారు.


చంద్రబాబుతో మంత్రి నిమ్మల


చంద్రబాబుతో మంత్రి పార్థసారథి


చంద్రబాబుతో ఎమ్మెల్యే రఘురామ


చంద్రబాబుతో కలెక్టర్ వెట్రి సెల్వి

రఘురామ.. ది బెస్ట్

తన నియోజకవర్గంలో డ్రెయిన్లలో పూడికలు తీయించేందుకు, రైతులను ఆదుకునేందుకు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అద్భుతంగా వ్యవహరించారంటూ సీఎం చంద్రబాబు ప్రశంసించారు. రైతుల నుంచి తనంతట తానుగా విరాళాలు సేకరించి నియోజకవర్గంలో అందరినీ చైతన్య వంతులను చేయడమే కాకుండా తాను చైతన్యమై వ్యవహరించారంటూ కీర్తించారు.

యూత్ ఆఫీసర్స్.. వెరీగుడ్

జిల్లాలో సమస్యలు ఎదురైనప్పుడు సమయస్ఫూర్తితో ఉత్తేజపూరితంగా పని చేస్తున్నారు. తక్షణం స్పందించి వేగంగా క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. వరదల్లోను మీరంతా స్పందించిన తీరు బాగుంది. అంతా యూత్ కదా.. వెరీగుడ్ అంటూ సీఎం చంద్రబాబు జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప శివకిశోర్‌తోపాటు మిగతా అధికారులు వరదల్లో విశేష కృషి చేయడమే కాకుండా కొల్లేరు అవుట్‌ఫాల్ డ్రెయిన్ అయిన ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద నీరు వెళ్లడానికి అవకాశంలేని తరుణంలోను కలెక్టర్, ఎస్పీలు స్వయంగా సాహసించి ఆ ప్రాంతానికి వెళ్లి తగు చర్యలు (మిగతా 8వ పేజీలో)

వరద గండం తప్పినట్టే..

- శాంతిస్తున్న గోదావరి.. తగ్గిన శబరి
- అయినా జలదిగ్బంధంలోనే విలీన మండలాల గ్రామాలు
- పోలవరం వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం
- నీట మునిగిన కడెమ్మ వంతెన.. ప్రాజెక్టుకి రాకపోకలు బంద్
- నాలుగోసారి నీట మునిగిన పంటపొలాలు

వేలేరుపాడు/కుక్కునూరు / పోలవరం, సెప్టెంబరు 11 : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం బుధవారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టడం, శబరి నదికి కూడా వరద ప్రవాహం తగ్గడంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు ప్రస్తుతానికి వరద గండం తప్పింది. బుధవారం ఉదయం భద్రాచలం వద్ద 50.6 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 49 అడుగులకు తగ్గింది. అయినా ఈ రెండు మండలాల్లో కొంత వరద పెరుగుతూనే ఉంది. ఈ వరదల కారణంగా 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ళలోకి వరద ప్రవేశించింది. రుద్రమ్మకోట, నాళ్ళవరం, చిగురుమామిడి, వేలేరుపాడులోని సంతమార్కెట్ సెంటర్‌లోకి వరదనీరు ప్రవేశించడంతో ఇళ్లు ముంపు బారిన పడ్డాయి. కుక్కునూరు మండలం చీరవల్లి,వింజరం గ్రామాల మధ్య ప్రధాన రహదారి మీదుగా వరద నీరు ప్రవహించడంతో కొన్నిగంటల పాటు రాకపోకలు నిలిచాయి. వెంకటాపురం కాలనీ నుంచి తెలంగాణ వైపు వెళ్లే రహదారి నీట మునిగింది. రాయకుంట పునరావాస కేంద్రాల్లో ఉన్న గొమ్ముగూడెం పంచాయతీ ఉప్పర మద్దిగట్ల గ్రామాల్లోని 130 కుటుంబాలకు ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి బాబ్జీ, తహ సీల్దార్ చలపతి, టీడీపీ మండలాధ్యక్షుడు మలిశెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు కోటగిరి సత్యనారాయణ, కుక్కునూరు ఉప సర్పంచ్ పిచ్చుక రాజు పాల్గొన్నారు.


కుక్కునూరు-వింజరం గ్రామాల మధ్య నీట మునిగిన రహదారి


వేలేరుపాడు సంతమార్కెట్ సెంటర్‌లో నీటమునిగిన ఇల్లు

కడెమ్మ వంతెనపై వరదనీరు

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పోలవరం వద్ద గోదావరిలో నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 12,72,578 క్యూసెక్కుల వరద జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో పోలవరం నుంచి ప్రాజెక్టుకి రాకపోకలు సాగించే ప్రధాన రహదారి కడెమ్మ వంతెనపై మూడడుగుల ఎత్తున వరద జలాలు ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టుకి రాకపోకలు బంద్ అయ్యాయి. అధికారులు యుద్ధప్రాతిపదికన పాండురంగడి కొండవైపు నుంచి ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది, కార్మికులు కడెమ్మ స్లూయిజ్ పైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రాజెక్టు చెక్‌పోస్టు వద్ద అడుగు ఎత్తున వరద జలాలు ప్రవహిస్తున్నాయి. వరద జలాలు కడెమ్మ స్లూయిజ్ గేట్లను ముంచెత్తడంతో ఏటిగట్టుకి కుడివైపున ఉన్న కొవ్వాడ, కొండవాగుల జలాలో పంటపొలాలు నీట మునిగాయి. ఈ ఏడాది వరి పొలాలు నీటమునగడం ఇది నాలుగోసారి. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ నీటిమట్టం 89.75 మీటర్లు నమోదు కాగా 360 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు రిజర్వాయర్ సిబ్బంది సత్యనారాయణ తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఎవరికీ సెలవుల్లేవు : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11 : జిల్లాలో భారీ వర్షాలు, వరదల తాకిడికి దెబ్బతిన్న గ్రామాల్లో వైద్యసేవలు నిర్విరామంగా కొనసాగేందుకు వీలుగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని విభాగాల వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది సహా, మిగతా ఉద్యోగుల్లో ఎవరికీ సెలవులు ఇవ్వకుండా నిలిపివేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వెల్లడించారు. ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లో 18 వైద్యశిబిరాలు, కైకలూరు, కోల్లేటికోట, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో 36 వైద్యశిబిరాలను నిరంతరం కొనసాగేందుకువీలుగా ఇటీవల ఎన్టీఆర్ జిల్లాకు డిప్యూటేషన్లపై పంపిన వైద్యులందరిని బుధవారం జిల్లాకు రప్పించి రెగ్యులర్ విధులను కేటాయించామన్నారు. వరదలు, వర్షాలు ప్రాంతాల్లో పాముకాటు కేసులు వచ్చే అవకాశంవున్నందున ఏఎస్‌వీ మందును పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పిచికారీ మందులను వినియోగిస్తున్నామని వివరించారు. పీహెచ్‌సీల్లో ఔషధాలకు కొరత లేదన్నారు.


కైకలూరు మండలంలో ముంపునకు గురైన చటాకాయ రహదారి

ముంపులోనే లంక గ్రామాలు

- కొనసాగుతున్న కొల్లేరు వరద
- చేపలు,రొయ్యల చెరువులకు గండ్లు
- జలమయమైన చటాకాయ రహదారి
- బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయిన పెంచికలమర్రు, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు

కైకలూరు/ మండవల్లి/ఏలూరు రూరల్/భీమడోలు, సెప్టెంబరు 11 : కొల్లేరు వరద ఉధృతి రోజురోజుకు పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఎటు చూసినా కంటిచూపు మేరకు కొల్లేరు ఉరకలు వేస్తూ వరద నీరు ప్రవహిస్తోంది. కైకలూరు మండలంలోని చటాకాయ, నత్తగుల్లపాడు ప్రధాన రహదారిపై బుధవారం మూడు అడుగుల మేర నీరు చేరింది. ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో ప్రజలు ఆ నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఒకవైపు గ్రామానికి ఆనుకుని ఉన్న చేపల చెరువులు కొల్లేరు గర్భంలోకి కలిసిపోయాయి. ఆలపాడు నుంచి కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. సర్కారు కాల్వ నుంచి కొల్లేటికోట పీహెచ్‌సీ వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కొల్లేరు ఉధృతిగా ప్రవహించడంతో రహదారిపై నాలుగు అడుగుల మేర నీరు చేరింది. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు రాష్ట్ర వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు 30 టన్నుల పడవను ఏర్పాటు చేసి పెంచికలమర్రు నుంచి పందిరిపల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు గ్రామాల ప్రజలను చేరవేస్తున్నారు. పెంచికలమర్రులో మంచినీటి చెరువు ముంపునకు గురికావడంతో గ్రామప్రజలు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండవల్లి మండలంలో లంక గ్రామాలన్నీ ముంపులోనే ఉన్నాయి. వరద ఉధృతి వల్ల ఆక్వా రంగానికి చావుదెబ్బ తగిలింది. చెరువు గట్లు ముంపునకు గురై చెరువుల్లోని చేపలు కొల్లేరు పాలవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెరువుకు గండ్లు రైతులు రాత్రింబవళ్ళు మట్టి బస్తాలతోనే అడ్డుకట్టు వేయడమే గాక కర్రలు పాతి వలలను కట్టి చేపలు, రొయ్యలను కాపాడుకుంటున్నారు. ఇంగిలిపాకలంక, మణుగులూరు, కొవ్వాడలంక, పెనుమాకలంక తదితర గ్రామాల్లో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోయారు. మూడు తాళ్లపాడు, ఉనికిలి, మూలపేట గ్రామాలకు సైతం ముంపు తాకింది. అయ్యవారిరుద్రవరం, పెరికేగూడెం, కానుకొల్లు గ్రామాల్లో వరిపొలాలు నీటిలో మగ్గుతున్నాయి. ఏలూరు రూరల్ మండలంలో . మొండికోడు, గుడివాకలంక రహదారుల పై వరదనీరు ప్రవహిస్తూనే ఉంది. బుధవారం ఉదయం స్వల్పంగా తగ్గినా సాయంత్రానికి కొద్దిగా వరద ప్రవాహం పెరగడంతో రాకపోకలను నిలిపివేశారు. గుడివాకలంక, కోమటిలంక, మొండికోడు తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాధవరం, మొండికోడు, కోమటిలంక, యాగనవిల్లి, ప్రత్తికోడులంక తదితర గ్రామాల్లో వరదనీరు భారీగా చేరడంతో ఆ గ్రామాల ప్రజలు ప్రస్తుతం నీటిలోనే ఉండాల్సిన పరిస్థితి. చాటపర్రు మీదుగా లంక గ్రామాలకు వెళ్లే రహదారులు జలమయం కావడంతో ఆ గ్రామాలకు వెళ్ళే ప్రజలు భీమడోలు, గుండుగొలను మీదుగా 60 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. భీమడోలు మండ లంలో కొల్లేరు గ్రామాలకు వచ్చి చేరుతున్న నీటి ఉధృతి బుధవారం తగ్గుముఖం పట్టింది. కొల్లేరు మినహా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు తగ్గింది. మల్లవరంలో నల్లకోడు వద్ద డ్రెయిన్ వరద నీటితో పరుగులు పెడుతుండగా కర్రకోడు వద్ద నీటి ఉధృతి పెరిగింది.


మండవల్లిలో వరద నుంచి చేపల చెరువులను కాపాడుకునేందుకు కట్టలు వేసిన దృశ్యం


భీమడోలు మండలం మల్లవరంలో రోడ్డుపైకి చేరుతున్న నీటికి ఇసుక బస్తాలతో అడ్డుకట్ట

ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

కలిదిండి : మండలంలో ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వలకట్లు కొట్టుకునే పోయ్యే ప్రమాదం ఉందని మత్స్య కారులు ఆందోళన చెందుతున్నారు. ఉప్పుటేరు ఉధృతికి పడవలు కొట్టుకు పోకుండా ఒడ్డుకు చేర్చారు. మట్టగుంట, పెదలంక పల్లిపాలెంలో ఉప్పు టేరులో జనాన్ని అవతల వైపునకు తీసుకెళ్లే బోటులను అధికారులు నిలు పుదల చేశారు. సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ, మద్వానిగూడెం, కొండం గి పల్లిపాలెంలో ఉప్పుటేరులో నీరు డ్రెయిన్ల ద్వారా చొచ్చుకుని వస్తోంది. సున్నంపూడిలో ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

కన్నీళ్ల...తాడిమళ్ల!


ప్రమాదం జరిగిన ప్రదేశం

తాడిమళ్ల కన్నీళ్లతో నిండిపోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు జీడి మామిడి పిక్కల బస్తాల కింద చితికి పోయాయి. జట్టు కూలీలు 'జట్టు'గానే విగత జీవులయ్యారు. నిద్ర కోసం మూసిన కన్ను మూసినట్టుగానే ఊపిరి ఆగిపోయింది. పన్నులు, టోల్ ఫీజులను తప్పించుకునేందుకు యజమాని అడ్డదారిలో వెళ్లడం వల్లే ఏడు కుటుంబాలను రోడ్డున పడేసింది.

- జీడిమామిడి పిక్కల కింద చితికిన కూలి బతుకులు
- ఒకే ఊరిలో ఆరుగురు.. ఒకే వీధిలో ముగ్గురు.. ఒకే కుటుంబంలో ఇద్దరు
- మొత్తం ఏడుగురిని మింగేసినచిన్నాయిగూడెం వ్యాను ప్రమాదం .. నలుగురు సురక్షితం
- మృతుల్లో ఒకరిది భీమవరం మండలం ఎల్‌వీఎన్‌పురం

రాజమహేంద్రవరం/భీమవరం క్రైం/కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తాడిమళ్లలో వంద వరకు జీడి పిక్కల ఫ్యాక్టరీలు ఉన్నాయి. గ్రామంతోపాటు చుట్టుపక్కల వాళ్లకు ఇదే ప్రధాన జీవనాధారం. మహిళలు ఇంటివద్ద జీడిపప్పు వలుస్తూ ఉపాధి పొందుతుంటారు. ఫ్యాక్టరీలకు అవసరమైన ముడిసరుకు జీడి పిక్కలను ఇక్కడికి తరలిస్తారు. వీటి ఎగుమతి, దిగుమతుల కోసం చుట్టు పక్కల ప్రాంతాలమగవాళ్లు ఈ పనులకు వెళ్తారు. పైగా ఈ మధ్య వర్షాల వల్ల వ్యవసాయ పనులు లేకపోవడంతో ఈ పనులపైనే ఎక్కువగా ఆధార పడ్డారు. ఈ క్రమంలో మేస్త్రి కత్తవ కృష్ణ(40) ఆధ్వర్యంలో కత్తవ నారాయుడు(45), తాడి రామకృష్ణ (45), తమ్మిరెడ్డి సత్యనారాయణ (44), దేశాల వీర వెంకటరావు(40), బొక్కా ప్రసాద్ (35), పెనుగుర్తి చిన ముసలయ్య (35) జట్టుగా మంగళవారం ఉదయం డీసీఎం వ్యానులో టి.నరసాపురం మండలం బొర్రంపాలెం వెళ్లారు. జీడి పిక్కలను బస్తాల్లోకి ఎత్తి ఎగుమతి చేసుకొని అక్కడి నుంచి రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో బయలుదేరారు. దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం దగ్గరలోని చిలకవారిపాకలు (పట్టాభిపురం) వద్ద 11.30 గంటల సమయంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది.


రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

మూసిన కన్ను మూసినట్లే..

రాత్రి 10.30 గంటలకు రాజవరం వద్ద భోజనాలు చేసి తిరిగి 11 గంటలకు వ్యాను కదిలింది. సాధారణంగా జట్టు కూలీలు లోడుపైనే నిద్రిస్తారు. మృత్యువాత పడిన ఏడుగురు, ప్రాణాలతో బయటపడిన గంటా మధు జీడి పిక్కల లోడుపై పడుకున్నారు. క్యాబిన్‌లో మరో జట్టు కూలీ లోయ ఇమ్మానయేలురాజు, డ్రైవరు మాపటి శివాజీకుమార్, క్లీనరు గంటి కిషోర్‌కుమార్ ఉన్నారు. వ్యాను కుదుపుల్లోపైన నిద్రిస్తున్న వారు కింద పడిపోకుండా బస్తాలను రెండు వరుసల్లో డొప్పలా వేసి మధ్యలో కూలీలు పడుకుంటారు. ఇదే స్థలంలో ఈ ఎనిమిది మంది నిద్రించారు. వ్యాన్ తాడిమళ్లకు 15 కిలోమీటర్ల దూరంగా ఉండగా చిలకవారిపాకల వద్ద మలుపు తిరిగింది. కొద్ది దూరంలో కుడి వైపు గొయ్యి ఉండడంతో వ్యాన్‌ను డ్రైవరు కాస్త ఎడమ వైపుకు తిప్పాడు. రోడ్డు పక్కన కేవలం అరడుగు వెడల్పుతో గ్రావెల్ బెర్మ్ ఉంది. వర్షాలకు అది లూజుగా తయారైంది. దీంతో వ్యాన్ టైర్లు ఈ బెర్మ్‌పైకి ఎక్కగానే జారిపోయింది. తుప్పలతో నిండిపోయి చిన్న లోయలోకి బోల్తా పడింది. లోడుపై పడుకున్న వాళ్లు 15 టన్నుల లోడు బస్తాల కింద నలిగిపోయారు. వ్యాన్‌కు ముందు వెళుతున్న మరో వ్యాన్‌లో ఫ్యాక్టరీ యజమాని మనిషి నక్కాకుల నాగబాబు మరో నలుగురు జట్టు కూలీలు ఉన్నారు. ప్రమాదానికి గురైన డ్రైవరు, క్లీనరు భయంతో పారిపోయారు. అదే క్యాబిన్‌లో వున్న ఇమ్మానుయేలు బయటకు వచ్చి ముందు వెళుతున్న వ్యాన్‌లో వారికి ఫోన్ చేశాడు. వాళ్లు, స్థానికులు వచ్చి బస్తాలు తీయడానికి శ్రమించారు. రెండు గంటలపాటు ప్రయత్నించి ఎనిమిది మందిని బయటకు తీశారు. ఊపిరాడక ఏడుగురు దుర్మరణం చెందారు. లోడుపై పడుకున్న గంటా మధు ప్రాణాలతో చెట్ల మధ్యన పడటంతో ప్రాణాలు దక్కాయి. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వ్యాను ప్రమాదంలో (మిగతా 8వ పేజీలో)



అవగాహన ఒప్పందంలో పాల్గొన్న ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, శంకర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ టీ.రవీంద్ర

గ్లకోమాపై ఏపీ నిట్ ఆచార్యుల పరిశోధనలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 11 : విశాఖపట్నానికి చెందిన ప్రముఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రితో ఏపీ నిట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. హైదరాబాద్‌లోని ఐఐటీలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మూర్తి, శంకర్ ఆసుపత్రి డైరెక్టర్ సిక్యూ ఐ అండ్ రీసెర్చ్ డాక్టర్ టీ.రవీంద్రలు సంతకాలు చేసి ఒకరికొకరు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. డాక్టర్ మూర్తి మాట్లాడుతూ గ్లకోమా అనేది కంటికి సంబంధించిన వ్యాధి అని తీవ్రత పెరిగితే ఒక్కోసారి కంటి చూపు పూర్తిగా మందగించే అవకాశాలున్నాయన్నారు. దీనిని కృత్రిమ మేధస్సు సాయంతో ముందుగానే కనుగొనేందుకు ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఆచార్యుడు డాక్టర్ శ్రీఫణికృష్ణ కర్రి ఆధ్వర్యంలో పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. కృత్రిమ మేధస్సు ఉపయోగించి యాప్ ద్వారా గ్లకోమా వ్యాధిని ముందుగా నిర్ధారిస్తారని, ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే వారు వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలని ఈ యాప్ సూచిస్తుందన్నారు. వైద్యాధికారులు, నిట్ ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు ఒకరి ఆలోచన మరొకరు పంచుకునేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు.నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్కే శాస్త్రి, ఆసుపత్రి మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కృష్ణప్రసాద్, రెటీనా సర్వీసెస్ విభాగాధిపతి డాక్టర్ టీ.కృష్ణ, జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, డీజీఎం ఎ.రమేష్ కుమార్ పాల్గొన్నారు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం 2024-25 పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 11 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం 2024-25 పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాలు అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించుటకు మరియు ఆన్‌లైన్‌లో సమర్పించుటకు ఈనెల 15వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించుటకు మరియు ఆన్‌లైన్‌లో సమర్పించడానికి ఈనెల 16వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు మరియు ఏఐ కోఆర్డినేటర్లు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించి మార్చి, 2022 నుండి మార్చి2024 వరకు పదవ తరగతిలో అనుత్తీర్ణత పొందినవారిని గుర్తించి వీరు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌లో చేరే విధంగా కృషి చేయాలి. పైన తెలిపినవారే కాకుండా 14 సంవత్సరాలు వయస్సు నిండి బడి బయట ఉన్నవారికి, ఇంత వరకు చదువుకోనివారికి సదరు విషయమును విస్తృత ప్రచారం చేసి ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌లో చేరే విధంగా కృషి చేయాలని డీఈవో నాగమణి సూచించారు.



రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11: త్వరలో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సంబంధించి బుధవారం ఏలూరు కేపీడీటీ కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 37వ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వి.రామ్‌ప్రసాద్ పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్స్ బాలుర విభాగంలో ఎం.పవన్‌కుమార్, జి.రాజు,ఎం.దుర్గారావు, పి.ఆనంద్, సబ్ జూనియర్స్ విభాగంలో జి.శామ్యూల్, జె.చరణ్, వై.విజయ్‌కుమార్, ఎం.చరణ్, జూనియర్స్ బాలికల విభాగంలో జి.సత్యయామిని, ఎం.పూజిత, ఎం.గంగా, ఎం.చంద్రిక, సబ్ జూనియర్స్ విభాగంలో జె.జోషిత, ఆర్.సంస్కృతి, జె.సిరివల్లిక, జి.యశోదలను ఎంపిక చేశారు. వీరంతా శ్రీకాకుళం జిల్లా పలాస గ్రామంలోని వజ్రపు కొత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. శ్యామ్‌బాబు, పాఠశాల హెచ్ఎం ప్రేమ్‌చంద్, జిల్లా టెన్నికాయిట్ కార్యదర్శి తిరుమలరావు పాల్గొన్నారు.

నరసాపురం-హైద్రాబాద్ ప్రత్యేక రైళ్లు రద్దు

నరసాపురం, సెప్టెంబరు 11 : ఈనెల 28,29, వచ్చేనెల 5,6 తేదీల్లో నరసాపురం-హైద్రాబాద్‌ల మధ్య నడిచే స్పెషల్ రైళ్లు రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం 07631 నెంబర్‌తో శనివారం రాత్రి 11.15 గంటలకు హైద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35 గంటలకు నరసాపురం చేరుకుంటుంది తిరిగి ఆదివారం 07632 నెంబర్‌తో రాత్రి 8 గంటలకు నరసాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు హైద్రాబాద్ చేరుకుంటుంది. ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకొని గత రెండేళ్ల నుంచి శని, ఆదివారాల్లో ఈ స్పెషల్ రైళ్లు నడుస్తున్నాయి. అయితే ట్రాక్ పనులు చేపడుతున్నందున తాత్కాలికంగా వీటిని రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

తిరిగి వస్తామనుకోలేదు..!

ఐదు నెలలు గల్ఫ్‌లో నరకం చూశాం..

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దయతో ఇండియాకు వచ్చాం



నరసాపురం, సెప్టెంబరు 11: "మంచి ఉద్యోగం అంటే నమ్మి వెళ్లాం..తీరా అక్కడికి వెళ్లిన తరువాత మోసపోయామని తెలిసింది.. ఐదు నెలలు నరకం అనుభవించాం.. ఏజెంట్లను నమ్మి మోసపోవొద్దు..అన్నీ సక్రమంగా ఉంటేనే వెళ్లాలి.. లేకపోతే మాలాంటి పరిస్థితే వస్తుంది.. తిరిగి ఇంటికి వస్తామని అనుకోలేదు..కేంద్ర మంత్రి నిర్మలా సీతా రామన్ మాకు మరో జన్మనిచ్చారు.." అంటూ గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయి ఖతార్ నుంచి నరసాపురం చేరుకున్న ఉండవల్లి రామలక్ష్మి, వాటాల ముత్యాల అరుణలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కేంద్ర మంత్రి వ్యక్తిగత పీఏ పేరాల మోహన్ నివాసంలో వీరిద్దరూ విలేకర్లతో మాట్లాడారు. మా ఇంటి సమీపంలోని ఓ ఏజెంట్ కడపకు చెందిన ఇద్దరి ఏజెంట్లతో కలిసి మమ్మల్ని ఖతార్ పంపించింది. అక్కడ మంచి ఇంట్లో పని అని నమ్మించారు. తీరా వెళ్లిన తరువాత మాకు తిండీ తిప్పలు లేవు. నరకం చూపించారు. ఏజెంట్‌ను నిలదీస్తే మా ఇద్దరిని వేరే చోటకు తీసుకెళ్లి బంధించారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పాం. జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు మా సమస్యపై వెంటనే స్పందించారు. మోహన్ ఈ విషయాన్ని కేంద్ర మంత్రి సీతారామన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఖతార్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులు, పోలీసులు వచ్చి మమ్మల్ని విడిపించి ఇండియా పంపారు. మేము మా పిల్లల్ని, కుటుంబ సభ్యుల్ని మళ్లీ చూశామంటే నిర్మలమ్మ దయే కారణమని కన్నీరుమున్నీరయ్యారు. నిర్మలా సీతారామన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో జరిగిన వరద బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

ఉప్పుటేరుపై రెగ్యులేటర్

ఏ రైతుకు నష్టం కలుగనివ్వం

కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగిస్తాం

కొల్లేరుపై ప్రత్యేక శ్రద్ధ పెడతాం

బాధితులతో సీఎం చంద్రబాబు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

భారీ వర్షాలు వరదల కారణంగా ఎంతో నష్టపోయాం. మీమీద ఎంతో నమ్మకం ఉంచాం. మాకు జరిగిన నష్టం, కష్టాన్ని మీరు కూడా చూశారు. అటువైపేమో నూజివీడులో పెద్ద చెరువుకు గండిపడి పెను నష్టమే జరిగింది. బుడమేరు నుంచి వచ్చిన వరద కొల్లేరును ముంచెత్తి ఎనలేని మానసిక వ్యథ మిగిల్చింది. భారీ వర్షాలు, వరదల సమయంలో అనేక కష్టనష్టాలు ఎదురైనా ఇప్పుడు మీరు తీసుకునే నిర్ణయాల పైనే మేమంతా ఎదురు చూస్తున్నాం. న్యాయం జరుగుతుందనే ధీమాతో ఉన్నామని కొల్లేరు, రామిలేరు, బుడమేరు పరీవాహక ప్రాంతాలకు చెందిన వారంతా సీఎం చంద్రబాబుకు ఏకరువు పెట్టారు. ఏలూరులోని సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో సీఎం చంద్రబాబు నాయుడు బాధితులతో ముఖాముఖి సంభాషించారు. ఉప్పుటేరులో రెగ్యులేటర్ నిర్మాణంపై సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తాం. కాల్వలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపు డెక్కను తొలగిస్తామని సీఎం చంద్రబాబు బాధితుల ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సీఎం హెలికాప్టర్‌లో బుధవారం ఉదయం 11.47 గంటలకు ఏలూరు సీఆర్ఆర్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, మేయర్ నూర్జహాన్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, రఘురామకృష్ణంరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళి రామకృష్ణ, మంతెన రామరాజు, జనసేన నాయకులు రెడ్డి అప్పల నాయుడు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

హెలీప్యాడ్ లేక సీఎం పర్యటన రద్దు

ఆకివీడు రూరల్ : ఆకివీడు మండలం దుంపగడప సమీపంలోని ఉప్పుటేరు పరిశీలించేందుకు బుధవారం సీఎం చంద్రబాబు పర్యటన హెలీప్యాడ్ లేకపోవడంతో రద్దయింది. అయి భీమవరం రహదారిలోని గతంలో రాష్ట్రపతి వచ్చిన హెలిప్యాడ్ చుట్టూ నీరు నిలవడంతో పరిగణలోకి తీసుకోలేదు. ఆకివీడు సీఎమ్ హైస్కూల్, ఏఎంసీని జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ అస్మీ పరిశీలించి సంతృప్తి చెందలేదు. ఆలపాడు వద్ద ఉన్న ఫ్లైఓవర్ వద్ద పరిశీలించారు. కైకలూరులో కొన్నిస్థలాలు పరిశీలించి హెలీప్యాడ్ నిర్మించేందుకు అనువుగా లేకపోవడంతో రాత్రి 12 గంటల సమయంలో పర్యటన రద్దు చేశారు.






1.ఏలూరు క్లబ్ నుంచి రూ. 10 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చంటి 2. సీఆర్ రెడ్డి కళాశాలల తరపున ఉద్యోగుల ఒక రోజు వేతనం రూ. 20 లక్షల చెక్కును అందిస్తున్న చైర్మన్ ఇంద్రకుమార్ 3. చింతమనేని చారిటబుల్ ట్రస్టు, కొవ్వలి మహిళల సహాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ 4. ఏలూరు కట్టా సుబ్బారావు ప్రాంతానికి చెందిన కొమ్మిన శేషకుమారి రూ.లక్ష విరాళం

సీఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి : ఏలూరు జిల్లాలో వరద నష్టాలను పరిశీలించడానికి జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలువురు ముఖ్యమంత్రి సహాయనిధికి, రాజధాని నిర్మాణానికి విరాళాలు అందజేశారు. సర్ సీఆర్ రెడ్డి కళాశాలల సంస్థల సిబ్బంది వరద సహాయ కార్యక్రమాలకు ఒక రోజు వేతనం రూ. 20 లక్షలను చైర్మన్ అల్లూరి ఇంద్ర కుమార్ సీఎంకు అందజేశారు. ఏలూరు క్లబ్ 10 లక్షల 116 రూపాయల చెక్కును ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ద్వారా అందించారు. రాజధాని నిర్మాణానికి చింతమనేని చారిటబుల్ ట్రస్టు రూ. 4లక్షల విరాళాల చెక్కు, దెందులూరు మండలంలోని కొవ్వలి గ్రామ మహిళల బృందం సేకరించిన ఐదు లక్షల రూపాయలు కలిగిన డిబ్బీని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సీఎంకు అందించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రూ.2 లక్షలను విరాళాన్ని సీఎంకు అందించారు. రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, మహిళా విభాగం కన్వీనర్ కె.నాగలక్ష్మి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం

ఎమ్మెల్యే బొలిశెట్టి రూ.10 లక్షల విరాళం



తాడేపల్లిగూడెం అర్బన్ : విజయవాడ ముంపు ప్రాంత పరిశీలనకు వెళ్ళిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. వరద బాధితుల సహాయం కోసం తన వంతుగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 లక్షలను ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు.

సీఎం చంద్రబాబును కలిసిన జడ్పీ చైర్‌పర్సన్

పెదపాడు : ఏలూరు జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుని బుధవారం ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాల వద్ద ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, బీసీ నాయకుడు ప్రసాదరావులు మర్యాద పూర్వకంగా కలిశారు.



మీరంతా రక్షిస్తేనే బతికా : వెంకట్రావు, పోతిరెడ్డిపల్లి



అందరూ రక్షించకపోతే నేను ఉండేవాడిని కాదు. రామిలేరు పొంగింది. ఎక్కడికక్కడ చెట్టుకొకరం, పుట్టకొకరం ఇరుక్కుపోయాం. నీటిలో చిక్కుకుని చెట్టుకొమ్మ పట్టుకుని పైకి ఎక్కాను. గ్రామస్థులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం అర్ధరాత్రి ఒంటిగంటకు నన్ను రక్షించగలిగింది. అప్పటి వరకు మంత్రి అక్కడే ఉన్నారు.

ఆడపిల్లలవాడిని..ఆదుకోండి : నాగేశ్వరరావు, ముదినేపల్లి



నాకు ఇద్దరు ఆడపిల్లలు. భారీ వర్షాల కారణంగా ఉన్న ఇల్లు కూలి పోయింది. భార్యా పిల్లలతో సహా పొరుగూరుకి వెళ్లి తలదాచుకున్నాం. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ఆడపిల్ల పెళ్లి సమయంలో ఆర్థిక సహాయం అందించేవారు. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేసింది. నా లాంటి పేద కుటుంబాలకు ఆడ పిల్ల పెళ్లి భారం కాకూడదు. ఆ పథకాన్ని పునరుద్ధరించండి.

పాడి రైతులను ఆదుకోండి : మరీదు గోవిందరావు



మాది పెదవేగి మండలం ముప్పవరం. వరదల కారణంగా ఒక గేదె చనిపోయింది. నాలాగా ఎనిమిది మంది రైతుల కొట్టాల్లోను మరో ఎనిమిది గేదెలు చనిపోయాయి. మేమంతా ఆర్థికంగా లేనోళ్ళం. కనీసం జరిగిన నష్టానికి తక్షణం ఆదుకోండి. దానికి మీరే సమర్థులు.

మాకు అన్నీ చేసిపెట్టారు : ఊర్మిళ



మా ఊరు గోగుంట. వరదల కారణంగా మా ఊరు మొత్తం నీట మునిగింది. ఎమ్మెల్యే ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి మమ్మల్ని శిబిరానికి పంపారు. అక్కడ అన్నీ సమకూర్చారు. ఉదయం అల్పాహారం దగ్గర నుంచి రాత్రి భోజనం వరకు కోడిగుడ్డుతో సహా అందించారు. వరద కారణంగా నష్టపోయి ఉన్న మమ్మల్ని ఆర్థికంగా ఆదుకోండి.

శనివారపుపేట కాజ్‌వే నిర్మించండి : అనూష



మాది ఏలూరు. ఆరవ తరగతి నుంచి ఇక్కడే చదువుతున్నా. ఏలూరు నగరంలో ముంపు కారణంగా ఎప్పుడూ ఇబ్బందే. దీనికి శాశ్వత పరిష్కారం చూపండి. కాజ్‌వే కట్టండి. మీరన్నా.. లోకేశ్‌బాబు అన్నా నాకెంతో ఇష్టం. కనీసం నాకు ఒక నిమిషం అవకాశం ఇవ్వండి. మీ మీద కవిత వినిపిస్తానని..చంద్రబాబును కీర్తిస్తూ ఒక కవిత వినిపించారు. చంద్రబాబు చిరునవ్వుతో ఆలకించి అభినందనలు తెలిపారు

లోయర్ డ్రెయిన్ సంగతి చూడండి : కిషోర్



పెదపాడు మండలం కడిమికుంట శివారు. లోయర్ డ్రెయిన్ కారణంగా 300 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. ఈ కారణంగా పంటలు కోల్పోతున్నాం. కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు చేయండి. వరదల సమయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రతీ కుటుంబం వద్దకు వెళ్లి లీటరు పాలు అందించి మమ్మల్ని పలకరించారు. రైతుల కోసం శాశ్వత నిర్ణయాలు తీసుకోండి.

పూడిక తీయాల్సిందే : పోసిన పాండు రంగారావు



మాది ముదినేపల్లి మండలం ఊటుకూరు. పన్నెండు రోజులుగా వరద నీటిలోనే పంట పొలాలు ఉన్నాయి. రైతులు ఎంతో నష్టపోయారు. గత ప్రభుత్వం కాల్వల్లో పూడికలు, కొల్లేరులో కిక్కిస, గుర్రపుడెక్క తొలగించని కారణంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. మీరైనా కలుగచేసుకుని ప్రతీ ఏటా కాల్వలు, డ్రెయిన్లలో పూడిక తొలగించండి.

బీర రైతును ఆదుకోండి : ఏడు కొండలు



వరదల కారణంగా నూజివీడు మండలంలో బీర, కాకర పంటలు దెబ్బతిన్నాయి. పెద్ద సంఖ్యలో వీటిని పండించిన రైతులు నష్టపోయాం. ప్రత్యేకించి కౌలు రైతులమైన మేము ఎంతగానో దెబ్బతిన్నాం. మమ్మల్ని పెద్ద మనస్సుతో ఆదుకోవాలి.

ఉప్పుటేరు సామర్థ్యాన్ని పెంచాలి : ఘంటసాల పెద్దిరాజు



58 ఏళ్లల్లో ఎన్నడూ లేని విధంగా కొల్లేరుకు వరద నీరు వచ్చింది. ఇంతకుముందైతే వచ్చిన నీరు వచ్చినట్టు ఉప్పుటేరు నుంచి దిగువకు పోయేది. కాని ఇప్పుడు కొల్లేరులో పది అడుగుల మేర మేటేసింది. ఉప్పుటేరులోను ఇంతకుముందు మాదిరిగా నీరు పారడంలేదు. ఇక్కడ రెగ్యులేటర్‌ను కట్టి ఉప్పుటేరులో నీటి సామర్థ్యాన్ని పెంచండి.

క్రైం కార్నర్..



నారాయణ, వినోద్ (ఫైల్)

వారాణసీలో అన్నదమ్ముల ఆత్మహత్య

అదృశ్యం అయినట్టు గత నెలలో చేబ్రోలులో ఫిర్యాదు

ఉంగుటూరు, సెప్టెంబరు 11 : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు పెరుమాళ్ల లక్ష్మీనారాయణ (34), పెరుమాళ్ళ లోక్ వినోద్ (32) వారాణసీలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భేల్‌పూరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోనాపూర్‌లోని మానస సరోవర్ ప్రాంతంలోని రామ్‌తారక్ ఆంధ్రా ఆశ్రమంలో మంగళవారం ఇరువురు సోదరుల మృతదేహాలు కుళ్లిపోయి ఉన్నాయని భేల్‌పూర్ ఏసీపీ ధనుంజయ్ మిశ్రా తెలిపారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వీరిద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. ఆశ్రమం ట్రస్టీ మేనేజర్ సుందర్ శాస్త్రి మాట్లాడుతూ వీరిద్దరూ తీర్థయాత్రలకు వచ్చారని ఆగస్టు 28 నుంచి రూమ్ తీసుకున్నట్లు పోలీసులకు తెలిపారు.మంగళవారం మధ్యాహ్నం ఆశ్రమ సిబ్బందికి గది నుంచి దుర్వాసన రావడంతో భేల్‌పూరా ఇన్స్‌పెక్టర్ విజయ్ శుక్లాకు సమాచారం అందించారు. కాగా ఈ అన్నదమ్ముల అదృశ్యం విషయమై ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాది తల్లిబోయిన రాజేష్ ఈ యేడాది మే నెల 15వ తేదీన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మే 12 సాయంత్రం అదృశ్యమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నలుగురు వ్యక్తుల వల్ల తాము మానసికంగా ఆందోళన చెందుతున్నామని వాట్సప్ ద్వారా వీడియోను కుటుంబ సభ్యులకు పంపారు. వీరు క్రికెట్ బెట్టింగ్‌ల వల్ల బుకీలకు అప్పులు చెల్లించాలని తెలిసింది. దీంతో వారి ఒత్తిడి తట్టుకోలేక ఈపని చేసినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాలకోడేరు, సెప్టెంబరు 11: అనారోగ్య కారణాలతో ఉరివేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శృంగవృక్షం గ్రామానికి చెందిన చింతపల్లి చినలక్ష్మి (43) బుధవారం మృతి చెందింది. పాలకోడేరు స్టేషన్ రైటర్ హజరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శృంగవృక్షం గ్రామానికి చెందిన 2015లో ఆమె పెద్ద కుమారుడు, 2020 ఆమె భర్త వెంకన్న చనిపోయారు. దీంతో ఆమె అప్పటి నుంచి మానసిక ప్రశాంతత కోల్పోయింది. ఆమె చిన్నకుమారుడు సతీష్ కుమార్ భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆమెకు చికిత్స చేయిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో ఆమె ఇంటిపక్కనే ఉన్న షెడ్డులో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు, స్థానికులు చూసి ఆమెను భీమవరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గణపతి ఉత్సవ మండపంలో గొడవ..ఒకరికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 11: తాడేపల్లిగూడెం దానమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవ పందిట్లో జరిగిన గొడవలో ఒక వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి సమీపంలోని దానమ్మగుడి వద్ద ఉత్సవ పందిట్లో బుధవారం రాత్రి గొడవ తలెత్తింది. ఎర్రా సతీష్ అవతలి వర్గానికి చెందిన ప్రసన్నకుమార్‌ను ఐరెన్ రాడ్డుతో తలపై కొట్టాడు. దీంతో ప్రసన్నకుమార్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రసన్నకుమార్ పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పురుగుమందు తాగి మహిళ మృతి

పెదవేగి, సెప్టెంబరు 11 : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. న్యాయంపల్లికి చెందిన నల్లమిల్లి నిర్మల ఐదేళ్ళుగా పక్షవాతంతో బాధపడుతోంది. మనస్థాపానికి గురైన ఆమె మంగళవారం రాత్రి పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు.చికిత్స పొందుతూ బుధవారం ఉదయం నిర్మల (50) మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11 : ఆర్థిక పరిస్థితులు తాళలేక ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి అబ్బదాసరి పోతురాజు (37)కు భార్య జ్యోత్స్నదేవి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 10వ తేదీ ఉదయం తన ఇంటి వద్దే పురుగు మందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రజా రవాణా అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ సమీక్ష

ఏలూరుసిటీ, సెప్టెంబరు 11: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్, ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా రవాణా శాఖాధికారులతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్ష నిర్వహించారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజు క్రమం తప్పకుండా బడి బస్సు సర్వీస్‌ను నడిపేలా చూడాలన్నారు. పల్లె ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు ఈ బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఈ బస్ సర్వీసుకు అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.కొత్త బస్టాండ్, పాతబస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ కోరారు. జిల్లా ప్రజా రవాణా అధికారి , ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌లు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్



నూజివీడు టౌన్, సెప్టెంబరు 11: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ రిజిస్ట్రార్‌గా అమరేంద్ర కుమార్‌ను నియమిస్తూ వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్ ఆదే శాలు జారీ చేశారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సివిల్ ఇంజ నీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సంద్ర అమరేంద్రకుమార్‌ను రిజి స్ట్రార్‌గా నియమించారు. 2016లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ట్రిపుల్ ఐటీలో చేరిన ఆయన 2021లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఆర్కే వ్యాలీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు ఇటీవల ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రిజిస్ట్రార్‌గా నియమించడం పట్ల నాలుగు ట్రిపుల్ ఐటీల అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

కన్నీళ్ల..తాడిమళ్ల!

(5వ పేజీ తరువాయి)



బొక్కా ప్రసాద్ (ఫైల్)

మృతి చెందిన వారు అతిపేదవాళ్లు. దుర్మరణం చెందిన వారందరికీ ఇద్దరేసి పిల్లలు ఉన్నారు.

అడ్డదారులు రోడ్డున పడేశాయి

జీఎస్టీ, మార్కెట్ తదితర పన్నులు, టోల్ ఫీజుల నుంచి తప్పించుకోడానికి అడ్డదారుల్లో సరుకును రవాణా చేయడం ఈ ప్రాంతంలో పరిపాటి. ఏడు కుటుంబాలు రోడ్డున పడితే గానీ ఈ తతంగం అధికారులకు కనిపించలేదు. వాస్తవానికి హెవీ లోడ్ వాహనాలు తిరగడానికి పనిచేయని మార్గాల్లో జీడి పిక్కలను రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. ఇప్పుడు ప్రమాదానికి గురైన వ్యాను జంగారెడ్డిగూడెం నుంచి హైవేలో తాడిమళ్ల చేరుకోవచ్చు. కానీ సింగిల్ రోడ్ల వెంబడి ప్రయాణించింది. గుర్వాయిగూడెం, లక్కవరం కట్ట, పోతవరం, చిన్నాయగూడెం, యర్నగూడెం మీదుగా తాడిమళ్ల వెళుతోంది. వర్షాల వల్ల ఈ దారులకు ఇరువైపులా దట్టమైన పొదలు, చెట్లు పెరిగిపోయాయి. పైగా ఎదురుగా వాహనం వస్తే తప్పించడం చాలా కష్టమైన పని. ప్రమాదానికి గురైన వ్యాను చిమ్మ చీకటిలో సింగిల్ రోడ్డులో వెళుతుండగా కుడి వైపున గొయ్యిని తప్పించబోయి ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిలో లారీలపై దూర ప్రాంతాలకు తిరిగిన అనుభవం డ్రైవరుకు ఉందని చెబుతున్నారు. దీంతో అడ్డదారే ఏడు కుటుంబాలను రోడ్డున పడేసిందని స్పష్టమవుతోంది.

ఎల్వీఎన్ పురంలో విషాద ఛాయలు

ప్రమాదంలో మృతి చెందిన బొక్కా ప్రసాద్(38) స్వగ్రామం భీమవరం మండలం ఎల్వీఎన్ పురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రసాద్‌కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుమారు నాలుగేళ్ల క్రితం తర్వాత బతుకు తెరువు కోసం నిడదవోలు మండలం ఉనకరమిల్లి వచ్చి అద్దెకు ఇల్లు తీసుకుని కుటుంబంతో ఉంటున్నాడు. జీడి పిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంతలోనే ఘోరం జరిగింది. ప్రసాద్ మృతదేహానికి బుధవారం సాయంత్రం స్వగ్రామం ఎల్వీఎన్ పురంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంతో చలాకీగా అందరితో కలిసిపోయే వ్యక్తి మృతి చెందడంపై గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సీఎం సంతాపం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతాపం తెలిపారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యేలు బూరుగుపల్లి శేషారావు, జీఎస్ నాయుడు, కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి తదితరులు సంతాపం తెలిపారు.



వరద ఫొటోలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, వివరిస్తున్న జేసీ

శభాష్.. మావాళ్లు గట్టోళ్లు

(5వ పేజీ తరువాయి)

తీసుకోవడం సీఎం దృష్టికి వెళ్ళింది. యుద్ధ ప్రాతిపదికన వీరు స్పందించిన తీరును ముఖ్యమంత్రి పరోక్షంగా అభినందించారు. దీనికితోడు వరదలు వచ్చినప్పుడు ఎవరైనా ప్రాణాంతక పరిస్థితులకు గురైనప్పుడు వారిని రక్షించేందుకు వీలుగా తాము ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామో ఎస్పీ శివకిశోర్ వీడియో ద్వారా వివరించినప్పుడు ఎస్పీని స్వయంగా సీఎం అభినందనలతో ముంచెత్తారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన సీఎం

ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో వరదపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. తడిసి ముద్దయిన వరి కంకులను సీఎం స్వయంగా పరిశీలించి ఎలాంటి నష్టం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేదికపై నుంచే పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వెట్రిసెల్వి సీఎంకు పూర్తిగా వివరించారు. సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులు పార్థసారథి, రామానాయుడు, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు కె.రఘురామకృష్ణం రాజు, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళి, గన్ని వీరాంజనేయులు, రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జనసేన నేత రెడ్డిఅప్పలనాయుడు, మేయర్ నూర్జహాన్, ఎస్పీ ప్రతాప శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, సీఆర్ రెడ్డి కళాశాల చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

తమ్మిలేరు పరిశీలన

ఏలూరు క్రైం : సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం సీఆర్ఆర్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన తమ్మిలేరు బ్రిడ్జి వద్దకు వచ్చి రెండువైపులా తమ్మిలేరు కాల్వను పరిశీలించారు. ఇరిగేషన్ ఎస్ఈ దేవ ప్రకాశ్ సీఎంకు జిల్లాలోని కాల్వల సమాచారం అందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి తమ్మిలేరు వరదల పరిస్థితిపై వివరించారు. ఆ కాల్వ వల్ల శనివారపుపేట కాజ్‌వే వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జోక్యం చేసుకుని తమ్మిలేరు పరిస్థితులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు.

భారీ బందోబస్తు

సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తున్నారని ఈనెల 10వ తేదీ అర్ధరాత్రి 1:30 ప్రాంతంలో జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్ కిశోర్, సిబ్బంది కలిసి అర్ధరాత్రి నుంచి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన తెల్లవారేటప్పటికి సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లుచేశారు. ఉదయం 6 గంటలకల్లా ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. బందోబస్తులో అదనపు ఏస్పీ ఒకరు, ఐదుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 46 మంది ఎస్ఐలు, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 450 మంది, హోంగార్డులు 145 మంది, స్పెషల్‌పార్టీ బృందాలు 105 మంది మొత్తం 964 మంది పోలీసులను వినియోగించారు. ముఖ్య మంత్రి హెలికాప్టర్ దిగుతున్న సమయంలోనే ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు. అయన తిరిగి మీటింగ్ హాలులోకి వెళ్లగానే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను విడిచిపెట్టారు.

పెచ్చులూడుతున్నాయి..

శిథిలమైన తహసీల్దార్ కార్యాలయం



భీమడోలు, సెప్టెంబర్ 11 : తహసీల్దార్ కార్యాలయ భవనం శ్లాబు పెచులూడి పడుతున్నాయి. శ్లాబ్ కాలం తీరడంతో పెచ్చులూడి పడు తుండడంతో భయభ్రాంతులకు గురవుతు న్నారు. అలాగే వర్షం వస్తే శ్లాబ్ నుంచి లీకై రికార్డులు, కంప్యూటర్లు పాడైపో తున్నాయని వాపోతు న్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రతి తహసీల్దార్ అధికారి ఐదేళ్లుగా నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. అయినా పట్టించు కోని పరిస్థితి. కనీసం కార్యాలయ నిర్వహణ నేపథ్యంలో పక్కనే ఉన్న గ్రామ సచివా లయానికి అయినా మార్చాలని అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

గణనాథుని నిమజ్జనం



ద్వారకాతిరుమలలో వినాయకుడి ఊరేగింపులో యువత ఆనందోత్సాహాలు



కొయ్యలగూడెం యర్రంపేటలో ఊరేగుతున్న గణనాథుడు



దెందులూరు మండలం గాలాయగూడెంలో గణనాథుని ఊరేగింపు



కొయ్యలగూడెంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



పోలవరంలో అన్న సమారాధన చేస్తున్న పోలీసులు



ఏలూరు కొత్తపేటలో గణనాథుని నిమజ్జనానికి మేళతాళాలు భాజాభజంత్రీలతో తీసుకువెళ్లుతున్న మహిళలు



జంగారెడ్డిగూడెం లక్కవరంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వినాయకుని ఊరేగింపు



పెదవేగిలో వినాయక మండపం వద్ద గ్రామస్తులు



జీలుగుమిల్లి మండలం రామన్నపాలెంలో పాల్గొన్న పలు వినాయక మండపాల కమిటీ సభ్యులు



ఏలూరులో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

నియోజవర్గంలోని పలు గ్రామాల్లోని మండపాలలో కొలువుదీరిన గణనాథుల నిజ్జనం కమిటీ సభ్యులు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. మేళతాళాలు, తీన్ మార్, విచిత్ర వేషధారణలతో స్వామివారి ఊరేగింపులు సాగుతున్నాయి. స్వామి వారి లడ్డూలకు వేలం నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన బుధవారం పలు చోట్ల ఏర్పాటు చేసిన అన్న సమారాధనలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జనాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏలూరు టూ టౌన్/ఏలూరు కార్పొరేషన్ దెందులూరు/పోలవరం/బుట్టాయగూడెం/ఏలూరు రూరల్/ కొయ్యల గూడెం/ జీలుగుమిల్లి/ పెదపాడు/టి.నరసాపురం/ ఉంగుటూరు/జంగారెడ్డిగూడెం/పెదవేగి/ద్వారకాతిరుమల సెప్టెంబరు 11 : పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక భద్రతా పోలీసు విభాగ కార్యాలయం వద్ద బుధవారం హెడ్ కానిస్టేబుల్ రాజేష్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. విగ్రహాన్ని బోట్ పాయింట్ ప్రాంతంలో నిమజ్జనం చేశారు. ప్రాజెక్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు మురళి గణేశ్, రాజేష్, రాము, పారినాయుడు పాల్గొన్నారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో గీతా మందిరం వద్ద గణేషుని విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూలను బుధవారం వేలం నిర్వహించగా 8 కేజీల లడ్డూను శీలబోయిన తాతారావు దంపతులు రూ.7,600లకు, 15 కేజీల లడ్డూను కొండపల్లి గంగాధర్ దంపతులు రూ.13,500లకు దక్కించుకున్నారు. పెదపాడు మండలం సత్యవోలులో జరిగిన గణపతి నవరాత్రి పూజా కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు సత్రంపాడులో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీగణపతి స్వామి వారి ఆలయంలో నగర మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు లక్ష్మీప్రభాకర్, ఎన్‌వీవీఎస్ ప్రసాద్, సోమేశ్వరరావు, ఆర్‌కే ప్రసాద్, శ్రీను, కార్పొరేటర్ నరసింహారావు, శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం కైకరం ఒకటో వార్డులో నిర్వహించిన లడ్డూ వేలంలో గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ దేవరాయ కాపు సంఘం తరపున రంగా యువసేన గౌరవాధ్యక్షుడు వెజ్జు వెంకట సుబ్బారావు లడ్డూ దక్కించుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని పలు వినాయక చవితి పందిళ్లలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్, పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ పాల్గొన్నారు. ద్వారకాతిరుమల తూర్పువీధిలో లంబోదర వినాయక కమిటీ ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ నిమజ్జనం వైభవంగా జరిగింది. మేళతాళాలు, తీన్‌మార్ నృత్యాలు, విచిత్ర వేషధారణల నడుమ గ్రామంలో ఊరేగించి శ్రీవారి పుష్కరిణిలో నిమజ్జనం చేశారు.

నిమజ్జనాల్లో డీజే హోరు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 11 : వినాయకచవితి మండపాల వద్ద డీజే బాక్సులు వినియోగించరాదని, ఊరేగింపుల్లో కాని, నృత్యాలు కాని చేయరాదని పోలీసు అధికారులు పదే పదే హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు కలిగించరాదని, ట్రాఫిక్‌నకు అంతరాయం కలుగజేయరాదని, విగ్రహ ఊరేగింపు ఏసమయంలో, ఏ మార్గంలో వెళ్తున్నారో ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్పష్టంగా తెలియజేశారు. ఏలూరు నగరంలో మాత్రం కొంతమంది వినాయక చవితి నిర్వాహకులు ఇవేమి తమకు పట్టవంటూ యదేచ్ఛగా డీజే బాక్సులతో, నృత్యాలతో ఊరేగింపులు చేస్తున్నారు. అడుగడుగునా ఊరేగింపు వాహనాలను ఆపి నృత్యాలు చేస్తూ ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగిస్తున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఏలూరు ఆర్ఆర్ పేట నుంచి వచ్చిన ఒక వినాయక విగ్రహ ఊరేగింపు స్కూలు, కాలేజీల వద్ద నృత్యాలు చేస్తూ డీజే సౌండ్లతో వాహనాలను ఆపి నృత్యాలు చేయడంతో ట్రాఫిక్‌నకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అక్కడ నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా వెళ్తు అడుగడుగునా ఆగుడూ నృత్యాలు చేస్తున్న ఏ ఒక్క పోలీసు అధికారి కన్నెత్తి చూడలేదు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం





ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో ఏలూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్

విజయవాడ వరద బాధితులకు విరాళాలు


ఉంగుటూరు,సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితకులకు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం అందిన వివరాలను కార్యాలయ నిర్యాహకులు తెలిపారు. ఎం.భీమశంకరం రూ.50 వేలు, ఎ.గోపవరం నాయకులు నాయుడు వీరన్న రూ11,111, భీమడోలుకు చెందిన చీమకుర్తి మురళి, మల్లికార్జునరావు రూ.10 వేలు, శ్రీలక్ష్మీనారాయణ అపార్ట్‌మెంట్ వాసులు(నారాయణపురం) రూ.20,001, డాక్టర్ సత్యం ఫౌండేషన్ తరపున బాలనాగు విజయ సారధి రూ.11 వేలు, చిలకంపాడు కూటమి నాయకులు రూ.1,0400లు అందజేశారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

లింగపాలెం, సెప్టెంబరు 11: పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన ఉండాలని, పౌష్టికాహారంతో బిడ్డ శారీరక ఎదుగుదలతో పాటు ఆరోగ్యవరంగా కూడా ఎంతో శక్తి కలిగి ఉంటారని సీడీపీవో మాధవి అన్నారు. లింగపాలెంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు నిర్వహించారు. స్థానికంగా దొరికే ఆహార పదార్థాలతో పౌష్టికాహారం తయారు చేసే విధానం గురించి మాధవి వారికి వివరించారు. మూడేళ్ల పాటు తల్లిపాలనే పిల్లలకు ఇవ్వాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సూపర్‌వైజర్ కుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో జేఎం రత్నకుమార్, ఎంఈవో పాల్గొన్నారు.

● దెందులూరు, సెప్టెంబరు11 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఆట,పాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు సీడీపీవో కె.విజయలక్ష్మీ తెలిపారు. దెందులూరు పంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ తోట యేసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. టీడీపీ నేత జి.కొండయ్య చౌదరి, ఇ.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పునకు వ్యతిరేకంగా నిరసన



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందచేస్తున్న మాల ఉద్యోగుల ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 11: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమి లేయర్ తీర్పును నిరసిస్తూ మాల ఎంప్లాయీస్ కాన్సిట్యూషన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపి అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. తొలుత స్థానిక పాత బస్టాండు వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ చేరుకుని నిరసన తెలిపారు. భార తీయ బౌద్ధ మహాసభ, సమతా సైనిక్ దళ్, రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, మాల మహానాడు అధ్యక్షుడు దాసరి రమేష్ తదితరులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కేటాయించి ప్రైవేట్ రంగాల్లో కూడా రిజర్వేషన్లు పొడి గించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 40 లక్షల ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీఎన్‌డీవీ ప్రసాద్, బి.నాగరాజు, వీవీ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, ఎం.బెన్నర్, కె.ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు, సెప్టెంబరు 11 : విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నారాయణపురం, ఉంగుటూరు, యర్రమళ్ళ, వెల్లమిల్లి, బాదంపూడి, చేబ్రోలు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఈఈ జేపీబీ జనార్దన్ తెలిపారు.

ఏజెన్సీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 11 : ఏజెన్సీ విషజ్వరాలు ప్రభలుతున్న కారణంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ఉడతా వెంకటేష్ అధ్యక్షతన బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో అయన మాట్లాడుతూ ఏజెన్సీలో విషజ్వరాలు పెరుగుతున్నాయని సరైన వైద్యం అందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 108, ఫీడర్ అంబులెన్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టులను ఎత్తుగా నిర్మించాలని కోరారు. వాగులపై ఎత్తైన వంతెనలను నిర్మించాలని తెల్లం రామకృష్ణ కోరారు. ఎం.నాగమణి, టి.ముత్యాలమ్మ, ఐ.ఫ్రాన్సిస్, పి.నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

పెదపాడు, సెప్టెంబరు 11 : వసంతవాడలోని జడ్పీ హైస్కూల్‌లో తలదాచుకున్న గోగుంట గ్రామానికి చెందిన వరద బాధితులకు గ్రామానికి చెందిన ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన దాతలు, స్నేహితుల సహకారంతో బియ్యం, పప్పులు, కూరగాయలతో పాటుగా ఇతర నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

● ఏలూరు టూ టౌన్ : బౌద్ధమత సమానత్వ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కందుల రమేష్ ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులు 500 మందికి కూరగాయలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్.సురేష్, రమేష్‌బాబు, జాన్, షేక్ బాజీ, బర్నబాస్, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడా పోటీలకు ఎంపికలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 11 : నగరంలోని సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) అండర్-19 మహిళల క్రీడా పోటీలకు ఎంపికలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాజు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అండాళ్ళు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో ఈ సెలక్షన్లు ఉంటాయన్నారు.

● జంగారెడ్డిగూడెం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురు, శుక్రవారాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలకు ఎంపికలు జరుపుతున్నటు మండల కో ఆర్డినేటర్ ఎల్.జయరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 11,14,17,19 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ ఎంపికలో పాల్గొనవ చ్చన్నారు. 12న అథ్లెటిక్స్, యోగ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, 13న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపికలు జరుగుతాయని జయరాజు తెలిపారు.

● ఏలూరు రూరల్ : మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను గురువారం శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం ప్రకాష్ తెలిపారు. అండర్-14 నుంచి 17 ఏళ్లలోపు బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్, త్రోబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. పీడీ పద్మలత, మండల ఎస్జీఎఫ్ కోఆర్డినేటర్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి వైద్య పరీక్షలు

పోలవరం సెప్టెంబరు 11 : కొత్త రామయ్యపేట పునరావాస కాలనీలో బుధవారం వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలువురిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే సొంగా



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 11 : కార్యకర్తలకు అండగా ఉంటానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు గుండె సంబంధిత సమస్యలతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతంలో సేవలందిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు విషయం తెలియగానే బుధవారం ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసరావును పరామర్శించారు. అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

కాలనీ రోడ్లకు మోక్షం

ఉంగుటూరు, సెప్టెంబరు 11 : కైకరం పాటి మీద ఉన్న కాలనీ రహదారులను బుధవారం సర్పంచ్ సలగాల గోపి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ సందర్శించి కాలనీల పరిస్థితి ప్రజల ఇబ్బందులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వివరించారు. ఇటీవల జరిగిన ఉపాధి గ్రామ సభలో రోడ్ల అభివృద్ధికి రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు వారు తెలిపారు.

అమరవీరులకు నివాళి

పోలవరం సెప్టెంబరు 11 : విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన ఉద్యోగులు అమరులని వారిని దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.సూరిబాబు అన్నారు. అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ కార్యాలయం వద్ద బుధవారం అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్‌వో ధర్మయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిహెచ్ ఈశ్వరరావు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశుగ్రాసం అందజేత

పెదపాడు, సెప్టెంబరు 11 : వరద ప్రభావంతో ఏర్పడిన పశుగ్రాసం కొరత నివారించేందుకు ప్రభుత్వం వరద ముంపు గ్రామాల్లోని పాడిరైతులకు పశువుల దాణా (టీఎంఆర్)ను అందజేస్తున్నట్లుగా పెదపాడు పశువైద్యాధికారిణి వాణిసంధ్యశ్రీ తెలిపారు. కొణికి గ్రామంలో కూటమి నాయకుల సమక్షంలో పాడిరైతులకు పశుగ్రాసంను అందజేసి, పాడిరైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా సర్పంచి పొట్లూరి యుగంధర్ మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడిరైతులకు అందజేస్తున్న టీఎంఆర్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోరు శ్రావణి, గుత్తా అనిల్, అక్కినేని వంశీకృష్ణ, గంపా వంశీ, గుండపనేని కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

భీమడోలు, సెప్టెంబరు 11 : చినలింగంపాడు సాధువుదిబ్బ ప్రాంతంలో అనారోగ్యంతో మృతి చెందిన గండికోట సీతమ్మ కుటుంబానికి జనసైనికులు ఆర్థిక చేశారు. నిరుపేద కుటుంబమైన గండికోట సీతమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలకు ఖర్చుల నిమిత్తం రూ.ఆరు వేలను మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ప్రత్తిమదన్ అందజేశారు. భీమడోలు రైల్వే గేటు యూత్ సభ్యులు ఎం.దుర్గారావు, పి.ఆది, ఎస్.ప్రసాద్, రాజేష్, సాయి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై తల్లిదండ్రుల ఫిర్యాదు

లింగపాలెం, సెప్టెంబరు 11: తమ కుమార్తె కనిపించటం లేదంటూ తల్లిదండ్రులకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వారు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. బాలిక పెదనాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 11 : బాలికను లైంగికంగా వేధించిన కేసులో పట్టణానికి చెందిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. పట్టణానికి చెందిన బాలిక వారి ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఆ ప్రాంతంలోనే నివాసముంటున్న చోడగిరి రాజు బాలికను పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో బాలిక తల్లి వచ్చి చూడగా బాలికను బాత్‌రూంలో పెట్టి రాజు పారిపోయాడు. తల్లి ఫిర్యాదు మేరకు చోడగిరి రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాచు పామును పట్టుకున్న స్నేక్ సేవియర్



జీలుగుమిల్లి, సెప్టెంబరు 11 : హెచ్‌పీ బంక్ ఎదుట హోటల్ వద్ద గోదుమ తాచుపాము కన్పించింది. దీంతో అక్కడ ఉన్న స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. జంగారెడ్డిగూడెం లో స్నేక్ సేవియర్ సొసైటీ సంస్థకు సమాచారం ఇచ్చారు. సంస్థ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి అక్కడకు చేరుకున్నాడు. తాచుపామును పట్టుకున్నాడు. సమీప అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.



వరద ఫొటోలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, వివరిస్తున్న జేసీ

శభాష్.. మావాళ్లు గట్టోళ్లు

(5వ పేజీ తరువాయి)

తీసుకోవడం సీఎం దృష్టికి వెళ్లింది. యుద్ధ ప్రాతిపదికన వీరు స్పందించిన తీరును సీఎం పరోక్షంగా అభినందించారు. దీనికితోడు వరదలు వచ్చి నప్పుడు ఎవరైనా ప్రాణాంతక పరిస్థితులకు గురైనప్పుడు వారిని రక్షించేం దుకు వీలుగా తాము ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామో ఎస్పీ శివకిశోర్ వీడి యో ద్వారా వివరించినప్పుడు ఎస్పీని స్వయంగా సీఎం అభినందనలతో ముంచెత్తారు.

మీరంతా రక్షిస్తేనే బతికా : వెంకట్రావు, పోతిరెడ్డిపల్లి



అందరూ రక్షించకపోతే నేను ఉండేవాడిని కాదు. రామిలేరు పొంగింది. ఎక్కడికక్కడ చెట్టుకొకరం, పుట్టకొకరం ఇరుక్కుపోయాం. నీటిలో చిక్కుకుని చెట్టుకొమ్మ పట్టుకుని పైకి ఎక్కాను. గ్రామస్థులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్డీఆర్ఎఫ్ బృందం అర్ధరాత్రి ఒంటిగంటకు నన్ను రక్షించగలిగింది. అప్పటి వరకు మంత్రి అక్కడే ఉన్నారు.

ఆడపిల్లలవాడిని..ఆదుకోండి : నాగేశ్వరరావు, ముదినేపల్లి



నాకు ఇద్దరు ఆడపిల్లలు. భారీ వర్షాల కారణంగా ఉన్న ఇల్లు కూలి పోయింది. భార్యా పిల్లలతో సహా పొరుగూరుకి వెళ్లి తలదాచుకున్నాం. గతంలో తెలుగు దేశం ప్రభుత్వంలో ఆడపిల్ల పెళ్లి సమయంలో ఆర్థిక సహాయం అందించేవారు. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేసింది. నా లాంటి పేద కుటుంబాలకు ఆడ పిల్ల పెళ్లి భారం కాకూడదు. ఆ పథకాన్ని పునరుద్ధరించండి.

పాడి రైతులను ఆదుకోండి : మరీదు గోవిందరావు



మాది పెదవేగి మండలం ముప్పవరం. వరదల కారణంగా ఒక గేదె చనిపోయింది. నాలాగా ఎనిమిది మంది రైతుల కొట్టాల్లోను మరో ఎనిమిది గేదెలు చనిపోయాయి. మేమంతా ఆర్థికంగా లేనోళ్ళం. కనీసం జరిగిన నష్టానికి తక్షణం ఆదుకోండి. దానికి మీరే సమర్థులు.

మాకు అన్నీ చేసిపెట్టారు : ఊర్మిళ



మా ఊరు గోగుంట. వరదల కారణంగా మా ఊరు మొత్తం నీట మునిగింది. ఎమ్మెల్యే ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి మమ్మల్ని శిబిరానికి పంపారు. అక్కడ అన్నీ సమకూర్చారు. ఉదయం అల్పాహారం దగ్గర నుంచి రాత్రి భోజనం వరకు కోడిగుడ్డుతో సహా అందించారు. వరద కారణంగా నష్టపోయి ఉన్న మమ్మల్ని ఆర్థికంగా ఆదుకోండి.

శనివారపుపేట కాజ్‌వే నిర్మించండి : అనూష



మాది ఏలూరు. ఆరవ తరగతి నుంచి ఇక్కడే చదువుతున్నా. ఏలూరు నగరంలో ముంపు కారణంగా ఎప్పుడూ ఇబ్బందే. దీనికి శాశ్వత పరిష్కారం చూపండి. కాజ్‌వే కట్టండి. మీరన్నా.. లోకేశ్‌బాబు అన్నా నాకెంతో ఇష్టం. కనీసం నాకు ఒక నిమిషం అవకాశం ఇవ్వండి. మీ మీద కవిత వినిపిస్తానని..చంద్రబాబును కీర్తిస్తూ ఒక కవిత వినిపించారు. చంద్ర బాబు చిరునవ్వుతో ఆలకించి అభినందనలు తెలిపారు

లోయర్ డ్రెయిన్ సంగతి చూడండి : కిషోర్



పెదపాడు మండలం కడిమికుంట శివారు. లోయర్ డ్రెయిన్ కారణంగా 300 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. ఈ కారణంగా పంటలు కోల్పోతున్నాం. కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు చేయండి. వరదల సమయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రతీ కుటుంబం వద్దకు వెళ్లి లీటరు పాలు అందించి మమ్మల్ని పలకరించారు. రైతుల కోసం శాశ్వత నిర్ణయాలు తీసుకోండి.

పూడిక తీయాల్సిందే : పోసిన పాండు రంగారావు



మాది ముదినేపల్లి మండలం ఊటుకూరు. పన్నెండు రోజులుగా వరద నీటిలోనే పంట పొలాలు ఉన్నాయి. రైతులు ఎంతో నష్టపోయారు. గత ప్రభుత్వం కాల్వల్లో పూడికలు, కొల్లేరులో కిక్కిస, గుర్రపుడెక్క తొలగించని కారణంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. మీరైనా కలుగచేసుకుని ప్రతీ ఏటా కాల్వలు, డ్రెయిన్లలో పూడిక తొలగించండి.

బీర రైతును ఆదుకోండి : ఏడు కొండలు



వరదల కారణంగా నూజివీడు మండలంలో బీర, కాకర పంటలు దెబ్బతిన్నాయి. పెద్ద సంఖ్యలో వీటిని పండించిన రైతులు నష్టపోయాం. ప్రత్యేకించి కౌలు రైతులమైన మేము ఎంతగానో దెబ్బతిన్నాం. మమ్మల్ని పెద్ద మనస్సుతో ఆదుకోవాలి.

ఉప్పుటేరు సామర్థ్యాన్ని పెంచాలి : ఘంటసాల పెద్దిరాజు



58 ఏళ్లల్లో ఎన్నడూ లేని విధంగా కొల్లేరుకు వరద నీరు వచ్చింది. ఇంతకుముందైతే వచ్చిన నీరు వచ్చినట్టు ఉప్పుటేరు నుంచి దిగువకు పోయేది. కాని ఇప్పుడు కొల్లేరులో పది అడుగుల మేర మేటేసింది. ఉప్పుటేరులోను ఇంతకుముందు మాదిరిగా నీరు పారడంలేదు. ఇక్కడ రెగ్యులేటర్‌ను కట్టి ఉప్పుటేరులో నీటి సామర్థ్యాన్ని పెంచండి.

ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన సీఎం

ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో వరదపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. తడిసి ముద్దయిన వరి కంకులను పరిశీలించి ఎలాంటి నష్టం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేదికపై నుంచే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ సీఎంకు పూర్తిగా వివరించారు. సీఎం తోపాటు మంత్రులు పార్థసారథి, రామా నాయుడు, ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యేలు కె.రఘురామకృష్ణరాజు, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళి, గన్ని వీరాంజనేయులు, రామరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జనసేన నేత రెడ్డిఅప్పలనాయుడు, మేయర్ నూర్జహాన్, ఎస్పీ ప్రతాప శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, సీఆర్ఆర్ కళాశాల ఛైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

తమ్మిలేరు పరిశీలన

ఏలూరు క్రైం : సీఎం చంద్రబాబు బుధవారం ఉదయం సీఆర్ఆర్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన తమ్మిలేరు బ్రిడ్జి వద్దకు వచ్చి పరిశీలించారు. ఇరిగేషన్ ఎస్ఈ దేవ ప్రకాశ్ సీఎంకు జిల్లాలోని కాల్వల సమాచారం అందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి తమ్మిలేరు వరదల పరిస్థితిపై వివరించారు. ఆ కాల్వ వల్ల శనివారపుపేట కాజ్‌వే వద్ద ప్రజల ఇబ్బందులను వివరించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మహేశ్‌కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని జోక్యం చేసుకుని తమ్మిలేరు పరిస్థితులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు.

భారీ బందోబస్తు

సీఎం జిల్లా పర్యటనకు వస్తున్నారని ఈనెల 10వ తేదీ అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారం అందింది. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్, సిబ్బంది కలిసి అర్ధరాత్రి నుంచి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన తెల్లవారేటప్పటికి సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లుచేశారు. ఉదయం 6 గంటలకల్లా సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. బందోబస్తులో అదనపు ఎస్పీ ఒకరు, ఐదుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 46 మంది ఎస్ఐలు, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 450 మంది, హోంగార్డులు 145 మంది, స్పెషల్‌పార్టీ బృందాలు 105 మంది మొత్తం 964 మంది పోలీసులను వినియోగించారు. సీఎం హెలికాప్టర్ దిగుతున్న సమయంలోనే ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు. ఆయన తిరిగి మీటింగ్ హాలులోకి వెళ్లగానే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను విడిచిపెట్టారు.



రామవరప్పాడులో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మంత్రి సారథి



వస్త్రాలు తీసుకెళుతున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



కలిదిండి నుంచి నిత్యావసరాల వ్యాన్‌ను తరలిస్తున్న దృశ్యం

వరద బాధితులకు అండగా..

విజయవాడకు నిత్యావసరాలు.. దుస్తులు తరలించిన దాతలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 11: వరద బాధితులకు అండగా నిలుద్దాం అంటూ నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామస్థులు సుమారు రూ. 5 లక్షల విలువ చేసే నిత్యావసరాలను ట్రాక్టర్ల ద్వారా విజయవాడ ముంపు ప్రాంతాల్లో పంపిణీ చేసేందుకు తరలివెళ్లారు. నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి పిలుపు మేరకు పల్లెర్లమూడి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిత్యావసరాలను విజయవాడకు తరలించగా రామవరప్పాడులో మంత్రి వాటిని బాధితులకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు అట్లూరి రమేష్, యనమదల సిద్ధయ్య, దావులూరి కృష్ణమోహన్, బెజవాడ శ్రీనివాసరావు, యనమదల దాసు, బడిబాట రాజేష్‌లు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దుస్తులు..

విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వస్త్రాలను వితరణ గావించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సహకారంతో ఏర్పడిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ విద్యార్థులు, ఫ్యాకల్టీల నుంచి సేకరించిన వస్త్రాలను విజయవాడ వాంబే కాలనీలో బాధితులకు అందించారు. వాహనాన్ని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించి పంపారు. 1,647 జతలను బాధితులకు అందించారు.

కాపు సంక్షేమ సంఘం నిత్యావసరాలు..

కలిదిండి: కొండంగి గ్రామ శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో 2 వేల మంది వరద బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం, నూనె, ఉప్పు ప్యాకెట్లు పంపిణీ చేశారు. తొలుత కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిత్యావసర సరుకుల వ్యాన్‌ను తహసీల్దార్ రామకృష్ణ ప్రారంభించి మాట్లాడుతూ దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. కాపు సంఘ నేతలు పన్నాస కృష్ణమూర్తి, మద్దూరి హరీష్, పంచకర్ల శివ, పన్నాస రామాంజనేయులు, సీహెచ్.రాము, కె.రమేష్, ఎ. శ్రీ సాయి, పి.రాము, ఎం.చిన్న, పి.పవన్, ఎం.బన్ని పాల్గొన్నారు.

కొల్లేరు సమస్యలు సీఎంకి వివరించా : కామినేని



స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వరదను పరిశీలిస్తున్న కామినేని

కైకలూరు/మండవల్లి, సెప్టెంబరు 11: కొల్లేటి బాధితులను ఆదుకుంటామని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కైకలూరు - ఏలూరు ఆర్అండ్‌బీ రోడ్డులో పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు పరిస్థితిని పరిశీలించేందుకు ముంపు నీటిలో ట్రాక్టరు నడుపుకుంటూ కామినేని వెళ్లారు. ముంపు బాధితులు ఆందోళన చెందవద్దని అవసరమైతే పునరావస కేంద్రాలకి తరలి రావాలని సూచించారు. అలాగే కైకలూరు-ఏలూరు రహదారిలో ముంపు ప్రాంతాలను కామినేని పరిశీలించారు. ఏలూరులో సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంలో కొల్లేరు ముంపునకు గల కారణాలను, బాధితులను ఆదుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను, ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను సీఎంకు తెలిపానన్నారు. సర్కారు కాలువ, ఉప్పుటేరు సమస్యలపై మాట్లాడినట్లు తెలిపారు. కైకలూరులో ముంపు నివారణ చర్యలు చేపడతామని కామినేని అన్నారు. కైకలూరు పట్టణంలోని ముంపును ఆయన పరిశీలించారు. 1, 2 వార్డులు, దానగూడెం గ్రామాన్ని ఎమ్మెల్యే అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. డ్రెయిన్ల ఆక్రమణలతో ముంపునకు గురైందని, ఇళ్ళలోకి నీరు చేరినా తమకు ప్రభుత్వం నుంచి ఏ సహాయం అందలేదని, అధికారులు సరైన సమాధానం చెప్పట్లేదని బాధితులు ఎమ్మెల్యేకు దృష్టికి తేగా ముంపునకు గురైన ప్రతి ఇంటికి పరిహారం అందేలా చూస్తాన న్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పెదగొన్నూరులో రైతులతో మాట్లాడుతున్న నిర్మాత కేఎల్ నారాయణ

రైతు సమస్యలు సీఎంకు చెబుతా : నిర్మాత నారాయణ

ముదినేపల్లి, సెప్టెంబరు 11 : రైతులు ఎదుర్కొంటున్న మురుగునీటి పారుదల వ్యవస్థకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని సినీ నిర్మాత, దుర్గా ఆర్ట్స్ అధినేత డాక్టర్ కె.ఎల్.నారాయణ హామీ ఇచ్చారు. తన స్వగ్రామమైన ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామ పరిధిలో వర్షాల వల్ల ముంపునకు గురైన పొలాలు, పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లను బుధవారం ఆయన రైతులతో కలసి పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి వాటి అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. పెదలంక మేజర్ డ్రెయిన్ గుర్రపు డెక్కతో నిండి నీరు కదలక పొలాలు ముంచేస్తున్నదని రైతులు నారాయణకు చెప్పగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో చర్చిస్తానని తెలిపారు. జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు గుడివాడ వేణు, నాగిరెడ్డి శివ ప్రసాద్, నచ్చిరెడ్డి శ్రీనివాసరావు, వీరంకి చక్రపాణి, పుప్పాల దుర్గా ప్రసాద్, గుడిసేవ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పోషకాహారంతో రక్తహీనత నివారణ

కైకలూరు, సెప్టెంబరు 11: పోషకాహారంతో కిశోర బాలికల్లో రక్తహీనత నివారించవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ వి. దీప్తి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం తామరకొల్లు హైస్కూల్లో కిశోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ రక్తహీనత ఉన్నవారు దానిని నివారించేందుకు పోషకాలతో కూడిన ఆహారాన్ని రోజూ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న చిక్కీలు, రాగి జావ అందరూ వినియోగించుకోవాలన్నారు. ఎంఈఓ డి. రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లావణ్య, వైద్య సిబ్బంది తాతారావు, శ్రీనివాసు, అంగన్వాడీ టీచర్లు నాగమణి, నిర్మల, జ్ఞాన సుందరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ముదినేపల్లి, సెప్టెంబరు 11: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని బుధవారం సత్కరించారు. స్థానిక సహాయ మాతా హైస్కూల్‌లో ఎంఈవో నరేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, రఘునాథబాబు, సూర్య ప్రకాశరావు, దినేష్ బాబు, దివ్య మేరీ ఫ్లారెన్స్, ఫాతిమా బేగం, కె.శ్రీనివాసరావు, ఇజ్రాయేలు, సాల్మన్ రాజులను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ సన్మానించి మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. టీచర్స్ యూనియన్ సంఘాల నాయకులు జి.రమేష్, బేతాళ రాజేంద్ర ప్రసాద్, సాయిలక్ష్మి, దండే వెంకటరత్నం, కృపాకర్, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు సన్మాన గ్రహీతలను అభినందించారు.

డేంజర్.. యమ డేంజర్

» ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ఉప్పువాగు కల్వర్టుపై రాకపోకలు



కొత్తగూడెం-యర్రావారిగూడెం మధ్య ఉప్పువాగు కల్వర్టు వద్ద ప్రమాదకరంగా రాకపోకలు

చాట్రాయి, సెప్టెంబరు 11: మండలంలోని కొత్తగూడెం- యర్రావారిగూడెం మధ్య ఉప్పువాగు కల్వర్టుపై రాకపోకలకు వాహనచోదకుల భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తి ఉప్పువాగుపై ఉన్న ఈ కల్వర్టు ధ్వంసమైంది. వరద ఉధృతితో 6 రోజుల పాటు యర్రావారి గూడెం నుంచి మండలంలోని మిగతా గ్రామాలకు రాకపోకలు ఆగిపోయి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం కూడా ఈ కల్వర్టుపై కొంత మేర వరద ప్రవహిస్తూనే ఉంది. కల్వర్టుపై పెద్ద గోతులు ఏర్పడటం, నీటిలో ఆ గోతులు కన్పించకపోవటం వల్ల ద్విచక్రవాహన చోదకులు కింద పడి గాయాల పాలవుతున్నారు. చిన్న కార్లు, లారీల కట్టలు విరిగిపోతున్నాయి. అవగాహన లేనివారు కల్వర్టు వద్ద దిగితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇటీవల తుమ్మగూడెం శివారు బిల్డింగ్ గూడెం వద్ద కల్వర్టు గురించి అవగాహన లేక బైక్‌తో వాగులో పడిపోయి లింగపాలెం మండలానికి చెందిన అధ్యాపకుడు దుర్మరణం పాలైన విషయం విదితమే. యర్రావారిగూడెం కల్వర్టు వద్ద కూడా అటువంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని, వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు జరిపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరద తగ్గాక మరమ్మతులు

చాట్రాయి మండలంలో యర్రావారి గూడెం, బిల్డింగ్ గూడెంల వద్ద కల్వర్టులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. వాగుల్లో వరద పూర్తిగా తగ్గిన తరువాత మరమ్మతు పనులు చేపడతాం. ఇక్కడ బ్రిడ్జిలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకు కొంత సమయం పట్టవచ్చు.

-బాబూరావు, డీఈఈ, ఆర్అండ్‌బీ శాఖ, నూజివీడు.





ముసునూరు, పేట కలిదిండిలో గణనాథుల గ్రామోత్సవం



పర్వతాపురం గణేష్ విగ్రహం వద్ద అన్నదానం

ఊరేగింపులు.. నిమజ్జనాలు

ముసునూరు, సెప్టెంబరు 11: మండల వ్యాప్తంగా చవితి ఉత్సవాల్లో ఐదో రోజు బుధవారం గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముసునూరు శ్రీ వేంకటాచల స్వామి ఆలయంలో మట్టి గణపతి, కేడీసీసీ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన మహా గణపతికి గ్రామోత్సవం నిర్వహించి, నగరాల చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే కొర్లకుంటలో విఘ్నేశ్వరుడి చేతిలో 10 కేజీల లడ్డూ ప్రసాదాన్ని తోట మోహన్‌రావు రూ. 25 వేలకు దక్కించుకున్నారు. గుడిపాడులో అన్నసమారాధన నిర్వహించి, స్వామివారి 10 కేజీల లడ్డూను రూ. 54,116లకు రాజబోయిన శ్రీదేవి మహిళా మండలి సభ్యులు పాటలో దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాలతో గణనాథులను వైభవంగా ఊరేగించి నల్లచెరువులో నిమజ్జనం చేశారు.

గణేష్ పందిరిలో భారీ అన్నదానం

చాట్రాయి, సెప్టెంబరు 11: మండలంలోని పర్వతాపురంలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం పందిరిలో బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల నాయకులు పలగాని దుర్గారావు, తల్లాడ శ్రీను, కంచర్ల హనుమంతరావు, బొర్రా నాగేశ్వరరావు, బూబత్తుల చెన్నారావు తదితరులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు మొగలు చెరువు వద్ద గల వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో విద్యార్థులతో గరిక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో మట్టగుంట, కొండంగి, పేట కలిదిండి గ్రామాల్లో బుధవారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. గణనాథులను ట్రాక్టర్‌పై పురవీధుల్లో మేళతాళాలతో, బాణాసంచా కాల్పులతో ఘనంగా ఊరేగించారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్



నూజివీడు టౌన్, సెప్టెంబరు 11: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ రిజిస్ట్రార్‌గా అమరేంద్రకుమార్‌ను నియమిస్తూ వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సంద్ర అమరేంద్ర కుమార్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. 2016లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ట్రిపుల్ ఐటీలో చేరిన ఆయన 2021లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. అనం తరం ఆర్కే వ్యాలీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, డైరెక్టర్‌గా పని చేయడంతో పాటు ఇటీవల ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయనను రిజిస్ట్రార్‌గా నియమించడం పట్ల నాలుగు ట్రిపుల్ ఐటీల అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 11: నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 13 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం డాక్టర్ హేమలత తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన వ్యాయామోపాధ్యాయుల సమావేశంలో పోటీల నిర్వహణకు కోర్టుల తయారీ, భోజన, వసతి సదుపాయాలపై చర్చించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, లక్ష్మి, వనజ, నాగరాజు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన

నూజివీడు, సెప్టెంబరు 11: మాల యోధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అంబేడ్కర్ వాది చేబత్తిన కోటేశ్వరరావు మాట్లాడుతూ దళితుల్లో ఐక్యత విచ్ఛిన్నం చేసే దిశగా తీర్పు ఉందన్నారు. వర్గీకరణ, క్రీమిలేయర్ విధానాన్ని విభేదిస్తూ ఆందోళన కొనసాగిస్తామని, ఉద్యమానికి మాదిగలు సహకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలను విడదీసే తీర్పును వ్యతిరేకిస్తూ పోరాడేందుకే మాలయోధుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎస్సీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు నత్తా నాగేశ్వరరావు, కాలి సురేష్, రాజ్‌కుమార్, రుద్రపాటి ప్రసాద్, పిళ్ళా చరణ్, కృష్ణంరాజు, తులిమెల్లి ఇజ్రాయేలు, రాజ్‌కుమార్, ఉదయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు చేయూత



ముదినేపల్లి, సెప్టెంబరు 11 : భారీ వర్షాల కారణంగా ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ పరిధిలో ఉపాధి కోల్పోయి నిరాశ్రయులైన యానాదులకు ఆ గ్రామంలోని లివ్ ఫర్ లాఫ్ స్వచ్ఛంద సంస్థ సహాయం అందజేసింది. సంస్థ ఛైర్మన్ హనుమార పేర్నీడు ఆధ్వర్యంలో బుధవారం సుమారు 40 యానాదుల కుటుంబాలకు రూ.50 వేల విలువైన బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను తహసీల్దార్ సుబానీ పంపిణీ చేశారు. సర్పంచ్ అల్లు సుశీల, ఎంపీటీసీ కోటే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. వర్షాలతో ఆ కుటుంబాల వారు చేపల వేట లేక పడుతున్న ఇబ్బందులను గమనించి సంస్థ ఛైర్మన్ పేర్నీడు వారిని ఆదుకున్నారు.

భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

ముసునూరు, సెప్టెంబరు 11: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ వేతనాలు, బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ముసునూరులో విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అవసరమైన వంట సామగ్రిని ప్రభుత్వమే ఇవ్వాలని రాజు డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాయకులు నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

పశువుల షెడ్డు దగ్ధం.. 4 గేదెలకు గాయాలు

ముదినేపల్లి, సెప్టెంబరు 11 : పెయ్యేరు బీసీ కాలనీలో బుధ వారం షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో పశువుల షెడ్డు పూర్తిగా దగ్ధం కాగా, పశువుల శరీరాలు కాలిపోయాయి. కాలనీకి చెందిన నిడుమోలు కోటేశ్వరరావు పశువుల షెడ్డులో జరిగిన ఈ ప్రమాదంలో మూడు పాడి గేదెల శరీరాలు తీవ్రంగా కాలిపోయాయి. ఒక గేదెకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో సుమారు రూ.3 లక్షల విలువ గల పాడి గేదెలు కొనఊపిరితో ఉన్నాయి. గ్రామంలోని మిల్క్ సొసైటీ ఛైర్మన్ హనుమార పేర్నీడు ఆధ్వర్యంలో పశువైద్యులు పాడి గేదెలకు చికిత్స చేస్తున్నారు.

కన్నీళ్ల తాడిమళ్ల!

(5వ పేజీ తరువాయి)

మృతి చెందిన వారు అతిపేదవాళ్లు. దుర్మరణం చెందిన వారందరికీ ఇద్దరేసి పిల్లలు ఉన్నారు.

అడ్డదారులు రోడ్డున పడేశాయి

జీఎస్టీ, మార్కెట్ తదితర పన్నులు, టోల్ ఫీజుల నుంచి తప్పించుకోడా నికి అడ్డదారుల్లో సరుకును రవాణా చేయడం ఈ ప్రాంతంలో పరిపాటి. ఏడు కుటుంబాలు రోడ్డున పడితే గానీ ఈ తతంతం అధికారులకు కనిపించ లేదు. వాస్తవానికి హెవీ లోడ్ వాహనాలు తిరగడానికి పనిచేయని మార్గాల్లో జీడి పిక్కలను రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. ఇప్పుడు ప్రమాదానికి గురైన వ్యాను జంగారెడ్డిగూడెం నుంచి హైవేలో తాడిమళ్ల చేరుకోవచ్చు. కానీ సింగిల్ రోడ్ల వెంబడి ప్రయాణించింది. గుగూడెం, లక్కవరం కట్ట, పోతవరం, చిన్నాయగూడెం, యర్నగూడెం మీదుగా తాడిమళ్ల వెళుతోంది. వర్షాల వల్ల ఈ దారులకు ఇరువైపులా దట్టమైన పొదలు, చెట్లు పెరిగిపోయాయి. పైగా ఎదురుగా వాహనం వస్తే తప్పించడం చాలా కష్టమైన పని. ప్రమాదానికి గురైన వ్యాను చిమ్మ చీకటిలో సింగిల్ రోడ్డులో వెళుతుండగా కుడి వైపున గొయ్యిని తప్పించబోయి ప్రమాదానికి గురైంది. నేషనల్ లారీలపై దూర ప్రాంతాలకు తిరిగిన అనుభవం డ్రైవరుకు ఉందని చెబుతున్నారు. దీంతో అడ్డదారే ఏడు కుటుంబాలను రోడ్డున పడేసిందని స్పష్టమవుతోంది.